సాక్షి
కుమురం భీం
శుక్రవారం, 10, మే, 2024



ఇంటర్ అడ్మిషన్లు షురూ..

ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. 2లో▸



జొన్న కోతలు షురూ..!

గ్రామాల్లో జొన్నపంట కోతలు ప్రారంభమయ్యాయి. కెరమెరి మండలంలో ఈ యాసంగి సీజన్‌లో 2,448 ఎకరాల్లో జొన్న పంట సాగైంది. 3లో▸

గరిష్ఠం/కనిష్ఠం
38.9 /28.5

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కొనసాగుతుంది.

పోలింగ్ కేంద్రాల్లో నిఘా


జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్

- 884 సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు
- కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం
- వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది. జిల్లాకు సరిహద్దుగా మహారాష్ట్ర ఉండటం, సిగ్నల్స్, సరైన రోడ్డు మార్గాలు లేని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడుగడుగునా నిఘా ఉంచనున్నారు. మారుమూల ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే ఎన్నికల ప్రక్రియను సైతం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచే పర్యవేక్షించేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూం నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా నిత్యం పర్యవేక్షించనున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఇలా..

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 356 పోలింగ్ కేంద్రాలు ఉండగా పార్లమెంట్ ఎన్నికల కోసం తాత్కాలికంగా 70 కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేశారు. అలాగే సిర్పూర్‌లో 320 కేంద్రాలు ఉండగా.. ఓటర్ల సౌకర్యార్థం అదనంగా 64 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 10 మహిళా కేంద్రాలు ఉండగా.. ఒక యూత్ పోలింగ్ స్టేషన్‌తోపాటు ఒక పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రం ఉంది. జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ దోత్రే నోడల్, సెక్టోరియల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో 4,56,309 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల తేదీ సమీపిస్తుండడంతో 95 శాతం పోలింగ్ చీటీల పంపిణీ పూర్తి చేశారు. 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ క్రమంలో ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎండల తీవ్రతతో పలు నియోజకవర్గాల్లో ఎన్నికల సంఘం పోలింగ్ సమయం పెంచింది. జిల్లా భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగియనుంది. ఎన్నికల్లో బందోబస్తు కోసం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా బలగాలను కేటాయించారు. మండల, పట్టణ ప్రాంతాలతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో బందోబస్తు చేపడుతున్నారు. ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ప్రజల్లో భరోసా కల్పించేందుకు ఇప్పటికే మారుమూల ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. పోలింగ్ శాతం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

వెబ్ కాస్టింగ్‌తో పర్యవేక్షణ

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 884 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. 498 పోలింగ్ కేంద్రాల్లో లోపలి భాగంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుండగా.. 313 కేంద్రాల్లో బయట, 61 షాడో కేంద్రాల్లో లోపలివైపు, మరో 12 షాడో పోలింగ్ కేంద్రాల్లో బయటివైపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా సిర్పూర్ నియోజకవర్గంలో 435 కెమెరాలు ఇన్‌స్టాల్ చేస్తుండగా.. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 449 కెమెరాలు బిగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలోని కంప్యూటర్లకు ఈ కెమెరాలను అనుసంధిస్తారు. అక్కడి నుంచి హైదరాబాద్, ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయాలకు అనుసంధానం చేసి పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతోపాటు కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తారు. వెబ్ కాస్టింగ్‌తో ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని శాటిలైట్ ద్వారా గుర్తించవచ్చు. వీటితోపాటు సీసీ కెమెరాలతో నిత్యం నిఘా ఉంచుతారు. ఎన్నికల సమయంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి వీక్షించి వేగంగా చర్యలు తీసుకునేందుకు, సిబ్బందిని అప్రమత్తం చేయడానికి వెసులుబాటు కలుగుతుంది.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి


జైనూర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ అభ్యర్థి సుగుణ, నాయకులు

- ఇన్‌చార్జి మంత్రి సీతక్క

కెరమెరి(ఆసిఫాబాద్): కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ముండె యశోదా గృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రజలకు సేవ చేయాలని ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చారన్నారు. ప్రజలు ఓటు వేసి సుగుణను ఆశీర్వదించాలని కోరారు. ఇద్దరం కలిసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. సుస్థిర పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలు కైవసం చేసుకుని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పేదల పార్టీ కాదని, పెద్దల పార్టీ అని విమర్శించారు. పదేళ్లలో దేశాన్ని దోచుకుందని ఆరోపించారు. యశోదా మంత్రికి స్వీటు తినిపించి శాలువాతో సత్కరించారు.

జైనూర్(ఆసిఫాబాద్): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందని మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో గురువారం రోడ్‌షోతోపాటు సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించాలన్నారు. గత ప్రభుత్వం ఆత్రం సుగుణపై 50పైగా కేసులు నమోదు చేసిందని పేర్కొన్నారు.

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం కోసిని శివారులో ఉపాధిహామీ కూలీలతో గురువారం మంత్రి సీతక్క మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని, రూ.400 వరకు కూలి పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రశ్నించే గొంతుక పేదింటి బిడ్డ ఆత్రం సుగుణను గెలిపించాలన్నారు. మహిళల కు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. చేతికి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జీలు శ్యాంనాయక్, రావి శ్రీనివాస్, నాయకులు గణేశ్ రాథోడ్, రజాక్, సుదర్శన్, సాజిద్ దేశ్‌ముఖ్, సాగర్, జలపతిరావు, సుజాయత్ ఖాన్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఆత్మారాంనాయక్

రెబ్బెన(ఆసిఫాబాద్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రెండు పర్యాయాలు ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అజ్మీరా ఆత్మారాంనాయక్ హస్తం గూటికి చేరారు. గురువారం కమలం పార్టీని వీడి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, బడుగు బలహీన వర్గాలు, గిరిజనుల అభ్యున్నతికి ఇస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఆత్మారాంనాయక్‌తో పాటు సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహబూబ్ అలీ, సేవాలాల్ సేన జిల్లా నాయకులు జర్పుల తిరుపతి, నాయకులు మోహన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.


ఆత్మారాంనాయక్‌కు కండువా కప్పుతున్న సీఎం

న్యూస్‌రీల్

నేడు 5కే రన్

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంలో భాగంగా ఈ నెల 10న 5కే రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఈ నెల 13న నిర్వహించే ఎన్నికల్లో అధికంగా పోలింగ్ శాతం నమోదు చేయడం, ఓటర్లకు అవగాహన కల్పించేందుకు 5కే రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఉదయం 6 గంటలకు ఈ రన్ ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లా అధికారులు, ఉద్యోగులు, యువకులతోపాటు ప్రతిఒక్కరూ ఇందులో భాగస్వాములై.. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రెయినీ ఐఎఫ్‌ఎస్


కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ప్రసాద్

ఆసిఫాబాద్‌అర్బన్: శిక్షణలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ట్రెయినీ ఐఎఫ్‌ఎస్ ఏవీఎస్ ప్రసాద్ గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్క అందించారు. జిల్లా పరిస్థితులపై చర్చించారు.

'మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి'


లింగాపూర్‌లో మాట్లాడుతున్న నగేశ్

లింగాపూర్/జైనూర్: నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. లింగాపూర్ మండల కేంద్రంలోని జగదాంబ ఆలయంతోపాటు, జైనూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తుందన్నారు. ప్రజలు మోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, మండల అధ్యక్షులు రాథోడ్ రమేశ్, దౌలత్‌రావు, నాయకులు అశ్విన్, శ్రీకాంత్‌చారి, హిరామన్, రాహుల్, అశోక్, ఆత్రం అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మొక్కను పరిశీలిస్తున్న అధికారి

కెరమెరి(ఆసిఫాబాద్): వేసవిలో ఆయిల్‌పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి వెంకటేశం అన్నారు. మండలంలోని ధనోరా, పార్డా గ్రామాల్లోని ఆయిల్‌పామ్ తోటలను గురువారం పరిశీలించారు. రైతులకు సాగుపై సూచనలు చేశారు. ఆయిల్‌పామ్ మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుము, పచ్చిరొట్టి పెంచాలని సూచించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఆయిల్‌పామ్ మొక్కలు ఎండిపోకుండా 150 నుంచి 165 లీటర్ల నీటిని అందించాలన్నారు. తోటల్లో అంతర్ పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ గంగుల కిరణ్, రైతులు బాలాజీ, మహదు ఉన్నారు.

15 నుంచి చెస్ శిక్షణ శిబిరం

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 15 నుంచి చెస్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సామిల్ల సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికలకు ఉచిత వేసవి శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 14లోగా తమ పేర్లను కోచ్ అంబాల కల్పన వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8978 14656 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికలకు పటిష్ట భద్రత


- ఎస్పీ సురేశ్‌కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గురువారం అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్‌తో కలిసి ఎన్నికల నిర్వహణపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన మహా ఆయుధం ఓటు హక్కు అని, ప్రజాస్వామ్య రక్షణకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్‌కు ముందు 72 గంటల పాటు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎస్‌ఓపీ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. 48 గంటల ముందు నుంచి ఆయా ప్రాంతాల్లోని వైన్‌షాపులు, లేట్‌నైట్ నిర్వహించే దాబాలు మూసివేయాలన్నారు. ప్రచారాలతో పాటు వాహనాలు తిరగకుండా చూడాలన్నారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర, అంతర్‌జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల రోజు పోలీసు స్టేషన్ల పరిధిలోని మొబైల్ రూట్లలో ఏదైనా ఘటనలు జరిగితే స్థానిక ఎస్సై, సెక్టోరల్ అధికారి, రూట్ మొబైల్ టీమ్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించాలని సూచించారు. శాంతిభద్రతల సమస్యలు ఉంటే నోడల్ అధికారులకు తెలియజేయాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ దళాల ద్వారా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు అధిక సంఖ్యలో గుమిగూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం కాదు

- జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్


మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్: రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగతో కలిసి గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతోనే ఆ పార్టీ నాయకులు రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ నాయకులు దురుద్దేశంతో ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ రిజర్వేషన్ల గురించి ఏనాడూ మాట్లాడలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 1885 నుంచి కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగమే మాకు పవిత్ర గ్రంథమని మోదీ పలుమార్లు చెప్పినట్లు గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసినట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ బీజేపీ హయాంలోనే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రామ్‌నాథ్ కోవింద్, గిరిజన మహిళ ద్రౌపది ముర్మూకు రాష్ట్రపతి పదవి దక్కిందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, ఈదులవాడ గణేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విత్తు.. ఎంచుకుంటే ముప్పు!

- పత్తి విత్తనాల ఎంపికలో అప్రమత్తత అవసరం
- ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు నకిలీ విత్తనాలు!
- రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసిన వ్యాపారులు
- ఏజెంట్ల ద్వారా గ్రామాలకు తరలించేలా కార్యాచరణ
- నిఘా పెంచిన వ్యవసాయశాఖ అధికారులు



వాంకిడి(ఆసిఫాబాద్): ఆదివాసీల ఖిల్లా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అమాయక రైతులే టార్గెట్‌గా కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. అధికారుల కళ్లు కప్పి తక్కువ ధరల ఆశ చూపి ప్రమాదకరమైన విత్తనాలను అంటగడుతున్నారు. జిల్లాలో మొత్తం 4.65 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. అందులో అత్యధికంగా 3.32 లక్షల ఎకరాల వరకు పత్తి పంటే సాగవుతుంది. ఎకరానికి రెండు విత్తన ప్యాకెట్ల చొప్పున మొత్తం జిల్లాలో సుమారు 7 లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇక్కడి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొందరు వ్యాపారులు ఇప్పటికే నకిలీ విత్తనాలను ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు దిగుమతి చేసుకున్నట్లు సమాచారం. సీజన్ ప్రారంభానికి మరో నెలరోజులే ఉండగా.. ఇప్పటికే ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగానే గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సాగించేందుకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు.

పల్లె రైతులే టార్గెట్..

జిల్లాలో అత్యధికంగా పత్తి పంట సాగు చేస్తుండటంతో వ్యాపారులకు నకిలీ పత్తి విత్తనాల దందా లాభసాటిగా మారింది. తక్కువ ధరతోపాటు పంటలో కలుపు సమస్య ఉండదని మభ్యపెడుతూ పల్లె రైతులను టార్గెట్‌గా చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. గ్రామాల్లో నమ్మకస్తులైన ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు నకిలీలపై నిఘా పెంచడంతో రెండేళ్ల నుంచి వారు కొత్త తరహా మార్గాలను ఎంచుకుంటున్నారు. రహస్య స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుని గుట్టుచప్పుడు అమ్మకాలు సాగిస్తున్నారు. రూ.కోట్ల అక్రమ సంపాదనకు పడగలెత్తుతున్నారు. గతంలో నాసిరకం విత్తనాలు అంటగట్టడంతో పూత, కాయ రాక దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని ప్రముఖ ఫర్టిలైజర్ దుకాణాల వ్యాపారులు మండలాల వారీగా అనుమానం రాకుండా నిల్వ చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. సరిహద్దులోని మహారాష్ట్ర ప్రాంతాల్లో కూడా విక్రయాలు సాగిస్తున్నారు. దుకాణాల్లో పని చేసే వారే గ్రామాల్లోని ఏజెంట్లకు సప్లయర్‌లుగా ఉండి యజమానికి ఎలాంటి రిమార్కులు లేకుండా చూసుకుంటున్నారు. తనిఖీలు నిర్వహించినా నకిలీ విత్తనాలు పట్టుబడకపోవడానికి ఇదే కారణమని సమాచారం. ప్రధాన రహదారుల గుండా కాకుండా గ్రామాలకు వెళ్లే షార్ట్‌కట్ రూట్‌లలో నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్నారు.

నెల రోజుల ముందే..

పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అనేక చోట్ల ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ముందస్తు ఆలోచనతో వ్యాపారులు నెలరోజుల క్రితం నుంచే.. అంటే ఎన్నికల కోడ్ వెలువడక ముందు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూలు, ఇతర జిల్లాల నుంచి నకిలీ విత్తనాలను జిల్లాకు తెప్పించారు. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఇదే అదనుగా రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారని తెలుస్తుంది.

నకిలీతో విపత్తు..

ప్రభుత్వ ఆమోదం లేని నాసిరకం విత్తనాలతో పూత, కాత సరిగ్గా ఉండదని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. భూసారం దెబ్బతింటుందని, భవిష్యత్తులో ఆ భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోతాయని, పంట దిగుబడి తగ్గుతుందని పేర్కొంటున్నారు. అలాగే నకిలీ విత్తనాల్లో నిషేధిత మందులు, పత్తి నుంచి వెలువడే రసాయనాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు. అక్రమార్కుల మాయామాటలు విని నాసిరకం విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచిస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమీపంలోని వ్యవసాయ కార్యాలయంలో తెలియజేయాలని కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

నకిలీ విత్తనాల సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టాం. అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. రైతులు విత్తనాల ఎంపికలో అధికారుల సలహాలు తీసుకోవాలి. కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు అడిగి తీసుకోవాలి. నకిలీ విత్తనాలు అంటగట్టేందుకు ప్రయత్నిస్తే వెంటనే సమాచారం అందించాలి. అలాంటి వారిపైనా పీడీ యాక్ట్ నమోదుకు కూడా వెనుకాడం.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

ఆసిఫాబాద్‌అర్బన్: అకాల వర్షాలు, ఈదురుగాలులతో ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తూ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షం, ఈదురుగాలులతో జిల్లాలో 23 విద్యుత్ స్తంభాలు, ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు వివరించారు. కెరమెరి, కౌటాల, తదితర ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టి, విద్యుత్ పునరుద్ధరించామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా వేగంగా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆసిఫాబాద్ సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, 24 గంటలపాటు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలపై 79016 28370 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

జైపూర్: ఈ నెల 2న అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహాన్ని గురువారం మండలంలోని ఇందారం రైల్వేట్రాక్ సమీపంలోని చెట్లపొదల్లో పోలీసులు గుర్తించారు. మంచిర్యాల రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పొగిల్ల యాదగిరి తల్లి కొండమ్మ(70) మతిస్థిమితం కోల్పోయి ఈ నెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. ఈ నెల 6న మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వృద్ధురాలు మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు మంచిర్యాల పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుపై ఆరా తీయగా కొండమ్మగా నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

భూగర్భ గనిలో పనికి భయపడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఉద్యోగం చేయలేక ఓ సింగరేణి కార్మికుడు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హమాలివాడకు చెందిన ఊరుగొండ ఓదెలు సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ అయి రెండో కు మారుడు సాయికుమార్ (27)ను పనిలో పె ట్టించాడు. గత నెల 20న ఆర్జీ–1 గోదావరిఖని మైన్‌లో బదిలీ వర్కర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి సాయికుమార్ తరచూ తండ్రితో నాన్న నాకు మైన్‌లో దిగాలంటే భయంగా ఉంది.. నేను ఉద్యోగం చేయలేనంటూ మొరపెట్టుకునేవాడు. కొన్ని రోజు లు కష్టపడితే ఓపెన్‌కాస్ట్‌లో పెట్టిస్తానని తండ్రి ధైర్యం చెప్తూ వచ్చాడు. గురువారం డ్యూటీకి వెళ్లిన సాయికుమార్ రైలు పట్టాలపై శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి మహిళ మృతి

కౌటాల: మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన చునార్‌కార్ మీరాబాయి (58) ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి మృతి చెందిందని ఎస్సై ఎస్.మధుకర్ గురువారం తెలిపారు. మీరాబాయి బుధవారం గ్రామ శివారులోని తమ చేనులో మిర్చి తెంపేందుకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పెన్‌గంగలో మృతదేహాన్ని గుర్తించారు. నదిలో నీటిని తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు మోరేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లు షురూ..

- ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ
- ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ప్రవేశాలు
- ఉమ్మడి జిల్లాలో 254 కళాశాలలు


నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ పచ్చజెండా ఊపింది. గురువారం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ పరిధిలోని జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 32వేలకు పైగా మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి.

రెండేళ్ల కోర్సులు

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రైవేట్, టీఎస్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ, కేజీబీవీ, టీఎంఆర్జేసీ, టీఎస్ మోడల్ జూనియర్ కాలేజీల్లో రెండేళ్ల ఇంటర్ కోర్సులు అందిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు, ఒకేషనల్ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎమ్మెల్టీ, ఫ్యాషన్ డిజైనింగ్, క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంటు, అకౌంట్స్ అండ్ టాక్సేషన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

అడ్మిషన్ల ప్రక్రియ ఇలా....

షెడ్యూల్ ఇలా...
తొలి విడత అప్లికేషన్లు జారీ : 9-5-2024
దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ : 31-5-2024
తరగతుల ప్రారంభం : 01-06-2024
అడ్మిషన్లు పూర్తయ్యే తేదీ : 30-6-2024

జిల్లాల వారీగా వివరాలు

జిల్లా	పదో తరగతి ఉత్తీర్ణులు	ఇంటర్ కాలేజీలు (ప్రభుత్వ, గురుకుల,ప్రైవేటు)
నిర్మల్	8,823	63
ఆదిలాబాద్	9,641	66
మంచిర్యాల	8,579	77
కుమరంభీమ్	5,325	48

ఇంటర్ ఫస్టియర్ తరగతులు జూన్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన టీసీ, స్టడీ సర్టిఫికేట్, తాత్కాలిక టెన్త్ మార్కుల మెమో ఆధారంగా ప్రిన్సిపాల్‌లు ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తారు. ఒరిజినల్ ఎస్సెస్సీ సర్టిఫికేట్ సమర్పించిన తర్వాత అడ్మిషన్లు నిర్ధారిస్తారు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 29 శాతం, పీహెచ్ 5 శాతం, ఎన్సీసీ, స్పోర్ట్స్ కోటా 5శాతం, ఎక్స్ సర్వీస్‌మెన్ 3శాతం, ఈడబ్ల్యూఎస్ 10 శాతం సీట్లు కేటాయిస్తారు. 33.3 శాతం అంటే 1/3 వంతు సీట్లు బాలికలకు రిజర్వ్ చేస్తారు. పదో తరగతిలో పొందిన గ్రేడింగ్ ఆధారంగా అడ్మిషన్లలో ప్రాధాన్యతనిస్తారు. తెలంగాణ ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన అనుబంధ కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు పొందాలని అధికారులు సూచిస్తున్నారు. అందుబాటులో ఉన్న కాలేజీల జాబితాను అధికారిక వెబ్‌సైట్ tsbie. cgg. gov. in చూడవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పదవ తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తమకు నచ్చిన కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చు. అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీలోనే చేర్పించాలి. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించి ఆర్థికంగా నష్టపోకూడదు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే నాణ్యమైన విద్య ఉచితంగా లభిస్తుంది.

– జాదవ్ పరశురాం, డీఐఈఓ, నిర్మల్ జిల్లా

13న సింగరేణికి సెలవు

శ్రీరాంపూర్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న సింగరేణి యాజమాన్యం వేతనం (పీహెచ్‌డీ)తో కూడిన సెలవును మంజూరు చేసింది. ఈమేరకు గురువారం కంపెనీ ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికల్లో కంపెనీ ప్రతి ఉద్యోగి, అధికారి తన ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఉత్తర్వులు విడుదల చేసినట్లు పేర్కొంది.

ఇద్దరు దొంగల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

లక్సెట్టిపేట: మండలంలోని పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ల చ్చవ్వ వద్ద రూ.25 వేలు అపహరించిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసిన ట్లు సీఐ నరేందర్, ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. కరీంనగర్ జిల్లా వీణవంక గ్రామానికి చెందిన శివరాత్రి సదయ్య, పెద్దపల్లి జిల్లా తుర్కల మద్దికుంటకు చెందిన గాదాసు రాజయ్య గురువారం ఉదయం ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా డబ్బులు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.23 వేలు రికవరీ చేసినట్లు తెలిపారు.

ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ


కాంగ్రెస్‌లో చేరిన గౌడ సంఘం నాయకులు

జన్నారం: ఎన్నికల్లో ఆదరించి గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్ గౌడ్‌తో పాటు కవ్వాల్ గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి సుగుణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కొత్తురుపల్లి, దేవునిగూడ, తిమ్మాపూర్, రాంపూర్ , తపాలపూర్, చింతగూడ గ్రామాల్లో మాజీ మంత్రి వేణుగోపాలాచారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, రాజశేఖర్, సుభాష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఇందయ్య, కరుణాకర్, తిరుపతిగౌడ్, చంద్రయ్య, రాకేశ్‌గౌడ్, శాభీర్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

‘గనుల వేలం ఆగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి’


మాట్లాడుతున్న గడ్డం వంశీకృష్ణ

కాసిపేట: సింగరేణిలో గనుల వేలం (ప్రైవేటీకరణ) ఆగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ , సీపీఐ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్‌పరం చేస్తూ బడా కాంట్రాక్టర్లకు అప్పగించి వారికి ఊడిగం చేస్తుందన్నారు. సింగరేణిని మొదటి నుంచి కాపాడుతూ వస్తుంది కాంగ్రెస్ పార్టీయేనని, కాకా వెంకటస్వామి నష్టాల్లో ఉన్న సంస్థను వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, నాయకులు శ్రీనివాస్, చిప్ప నర్సయ్య, బియ్యాల వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి’


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలక్రైం: రోగుల ప్రాణాలలో చెలగాటమాడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బహుజన రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నందిని, మెడిలైఫ్ ఆస్పత్రుల వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఈ నెల 6న బెల్లంపల్లికి చెందిన గర్భిణి రవళిక మృతి చెందిందన్నారు. దీనిపై విచారణ జరిపించి ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన రక్షణ సమితి నాయకులు వేముల వీరేందర్, తోట రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తెగిపడి గేదె మృతి


మృతి చెందిన గేదె వద్ద రైతు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం కోటేశ్వర్‌రావుపల్లె గ్రామ శివారులో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్‌తీగ తెగిపడి ఓ గేదె మృతి చెందింది. కనవేని కుమార్‌కు చెందిన పాడిగేదెను మేతకు తీసుకెళ్లి వస్తుండగా పొలంలో మెయిన్‌లైన్ తెగిపడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.90 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరుతున్నాడు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


నిరసన తెలుపుతున్న కూలీలు

బెల్లంపల్లిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చంద్రవెల్లికి చెందిన ఉపాధి హామీ కూలీలు గురువారం బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ చాలా రోజులుగా ఉపాధి పనులకు వెళ్తున్నా డబ్బులు పడడంలేదని, పనికి వెళ్లినా సక్రమంగా హాజరు వేయడంలేదని ఆరోపించారు. ఉపాధి హామీ సిబ్బంది, అధికారులు తమ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీడీవో మహేందర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వ్యాపారి అదృశ్యం

కౌటాల /కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి నాగమల్ల సురేష్ ఈ నెల 6న అదృశ్యమైనట్లు టౌన్ ఎస్సై అంజయ్య గురువారం తెలిపారు. చిట్ ఫండ్ వ్యాపారం నిర్వహించే సురేష్ ఇతరుల నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిళ్లు వస్తుండడంతో తట్టుకోలేక ఇంటినుంచి వెళ్లిపోయాడన్నారు. వ్యాపారి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత


పోలీసులు పట్టుకున్న లారీ

చెన్నూర్: పట్టణంలోని జాతీయ రహదారిపై గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంది. వాహనాల తనిఖీలో భాగంగా లారీని తనిఖీ చేయగా డ్రైవర్ మనోరంజన్ హజ్రా వద్ద ఎలాంటి వేబిల్లు లభించలేదు. దీంతో లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్ మనోరంజన్ హజ్రాతో పాటు లారీ యాజమాని జంగ రవిచంద్రారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. కాగా నెలరోజుల క్రితం ఇదే లారీ పట్టుబడినట్లు సీఐ తెలిపారు.

రామాలయంలో చోరీ

జన్నారం: మండలంలోని రేండ్లగూడ రామాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలోనికి ప్రవేశించి ప్రధాన ద్వారం పగులగొట్టే ప్రయత్నం చేశారు. తలుపులు తెరుచుకోకపోవడంతో హుండీని అపహరించుకుపోయారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రాజవర్ధన్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్: ఒకరిపై దాడి చేసిన కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం తల్వేద గ్రామానికి చెందిన రొద్ద ఎర్రన్న ఇంటి ముందు 2016 నవంబర్ 12న అదే గ్రామానికి చెందిన గడ్డం రాజు, అతని తండ్రి గంగన్న చెత్త పారేయడంతో వారిని ప్రశ్నించాడు. దీంతో అతనిపై దాడిచేసి గాయపర్చారు. బాధితుడు నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై అరిఫొద్దీన్ కేసు నమోదు చేశారు. ఏపీపీవో రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ నిందితులు గడ్డం రాజు, గంగన్నకు ఐదునెలల సాధారణ జైలు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ డి.విఠల్ (60) బుధవారం రాత్రి వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం ఉపాధిహామీ పనులకు వెళ్లిన విఠల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు భైంసా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య సావిత్రిబాయి, కుమార్తె లలిత ఉన్నారు.

జీజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్

- పాడైన కంప్యూటర్లు, వైద్య పరికరాలు
- రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా


పాడైన సీపీయూలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వైద్యపరికరాలు, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. ఇటీవల వీచిన ఈదురుగాలులకు ఆస్పత్రికి విద్యుత్ సరఫరా చేసే స్తంభం నేలవాలింది. షార్ట్ సర్క్యూట్ జరిగి ఆస్పత్రిలోని ఆరు కంప్యూటర్లు, మూడు ఈసీజీ మిషన్లు, ఐదు మల్టీప్యారా మీటర్లు, రెండు ఎబాస్ మిషన్ అడాప్టర్లు, విద్యుత్ కంట్రోల్ ప్యానల్, ఫ్యాన్లు, లైట్లు, సీసీ కెమెరాలు, రెండు సిరంజి పంపులు, ఒక వెంటిలేటర్ ఎయిర్ కంప్రెషర్, ఇంటర్నెట్ రూటర్‌లు పాడైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి తెలిపారు. రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.

మున్సిపల్ దస్త్రాల కాల్చివేత!


దస్త్రాలను కాలుస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగంలో ఉన్న పాత దస్త్రాలను గుట్టుచప్పుడు కాకుండా డంపింగ్ యార్డుకు తరలించి కాల్చివేసినట్లు సమాచారం. రెవెన్యూ విభాగానికి ఇంటి నంబర్లు, మ్యూటేషన్‌ల కోసం దరఖాస్తులు ఎక్కువగా వస్తుంటాయి. మున్సిపల్ దుకాణ సముదాయాల నుండి వచ్చే ఆదాయ వివరాలు, పన్ను వసూళ్లు, ఇంటి కొలతల ప్రకారం విధించిన పన్ను వివరాలకు సంబంధించిన దస్త్రాలు ఈ విభాగంలో ఉంటాయి. గుట్టు చప్పుడు కాకుండా కొన్ని దస్త్రాలను డంపింగ్ యార్డుకు తరలించి కాలుస్తుండగా విషయం బయటకు పొక్కింది. దీంతో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆదేశంతో మిగిలిన దస్త్రాలను తీసుకువచ్చి కార్యాలయం పక్కనే ఉన్న మున్సిపల్ కాంప్లెక్సులో భద్రపరిచినట్లు సమాచారం. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా రెవెన్యూ విభాగంలో అదనంగా ఉండే కొన్ని పేపర్లను డంపింగ్ యార్డుకు తరలించినట్లు తెలియగానే వాటిని కార్యాలయానికి తెప్పించామని, కాల్చడం వంటివి చేయలేదన్నారు.

‘గోడం నగేష్‌ను గెలిపించుకోవాలి’


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

జన్నారం: బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించుకునేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావాలంటే ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ ప్రవేశపెట్టిన పథకాలను గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్‌రావు, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బెడద గోపాల్, యువమోర్చా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు సూర్యం, నాయకులు లక్ష్మీరాజం , సత్తన్న, చంద్రశేఖర్, రమేశ్‌గౌడ్, మహేశ్, జలపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లుగా పంట పొలాలు

- అనుమతి లేకుండా ‘రియల్’ వెంచర్లు
- పట్టించుకోని అధికారులు


ఊత్కూరు శివారులో ఏర్పాటు చేసిన వెంచర్

లక్సెట్టిపేట: మండలంలో పంట పొలాలు ప్లాట్లుగా మారుతున్నాయి. కొందరు గ్రూపులుగా ఏర్పడి వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తూ నాలా, రెవెన్యూ, డీటీసీపీ అప్రూవల్, మున్సిపల్ అనుమతి లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు అనుమతి లే అవుట్‌లపై కొరడా ఝులిపించారు. ఈ నెల 3న అనుమతి లేని సర్వేనంబర్ 66, 67, 255, 253, 256, 361, 377లో వెలిసిన వెంచర్లను మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, టీపీఎస్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో హద్దురాళ్లు తొలగించారు. మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 172(16) ప్రకారం ఆమోదం లేని లే అవుట్‌లను రిజిస్ట్రేషన్ చేయవద్దని సంబంధిత శాఖ అధికారులకు మున్సిపల్ కమిషనర్ లేఖ రాశారు. అనుమతి లేని ప్లాట్లను కొనుగోలు చేయొద్దని, అన్ని డాక్యుమెంట్లు పరిశీలించి కొనుక్కోవాలని కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, రాపల్లి, హాజీపూర్, దొనబండ గ్రామ శివారు ప్రాంతాల్లో అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేశారు. భూములు కొనుగోలు చేసిన రిజిస్ట్రేషన్‌లు చేస్తుండడంతో పంచాయతీల ఆదాయానికి గండిపడుతోంది. నాలా కన్వర్షన్ చేసి లే అవుట్ అనుమతి వచ్చిన తర్వాత ప్లాట్లు చేయాలి. కానీ రియల్ వ్యాపారులు ప్రైవేట్ ఇంజినీర్లు, సర్వేయర్ల సహకారంతో హద్దురాళ్లు, సిమెంట్ పోల్స్ పాతేస్తూ గజాల చొప్పున అమ్మాల్సిన ప్లాట్లను గుంటల చొప్పున ఫామ్ ల్యాండ్స్ పేరుతో కూడా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వీటిల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడుతుండగా పంచాయతీలు ఆదాయం కోల్పోతున్నాయి. అనుమతి లేని వెంచర్లలో రిజిస్ట్రేషన్‌లు చేయరాదని పంచాయతీ రాజ్ శాఖ ద్వారా లేఖ అందజేసినా బుట్టదాఖలు అవుతున్నాయి. ఆ వెంచర్లలో కొనుగోలు చేసిన భూములకు డబ్బులకు ఆశపడి నేరుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు అనుమతి లేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.